## క్లుప్తంగా

### విద్యార్థుల ఇంటర్నల్ మార్కులు పరిశీలన



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఎంఈఓ ప్రభాకర్‌రావు

ఎర్రుపాలెం: మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో పది చదువుతున్న విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల జాబితాను బుధవారం వెరిఫికేషన్ టీమ్ ఉపాధ్యాయులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదివితే 10 పాయింట్లు సాధించవచ్చన్నారు. అనంతరం ఎంఈఓ వై.ప్రభాకర్‌రావు ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.

### సినిమాల్లో నారాయణపురం యువకుడు



వంశీని అభినందిస్తున్న కలెక్టర్ గౌతమ్

బోనకల్: మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన యువకుడు ఊటుకూరు వంశీ చిత్రరంగ ప్రవేశం చేశారు. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న ఆయన నటనపై ఆసక్తితో కొన్నాళ్ల నుంచి ప్రయత్నాలు చేస్తున్నాడు. ఈనెల 3న విడుదలైన తుపాకులగూడెం సినిమాలో అవకాశం దక్కగా, ప్రేక్షకాదరణ దక్కడంతో స్థానికులు వంశీని అభినందించారు. కాగా, ఖమ్మంలో మంగళవారం ఖమ్మం కలెక్టర్ గౌతమ్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి తదితరులు సినిమా చూసి వంశీతో పాటు చిత్రబృందాన్ని అభినందించారు.

### మంచికంటి సేవలు చిరస్మరణీయం

తల్లాడ: తెలంగాణ సాయుధ పోరాటంలో ముందుండి పోరాడిన మంచికంటి రాంకిషన్‌రావు సేవలు చిరస్మరణీయమని సీపీఎం జిల్లా నాయకుడు మాదినేని రమేష్ అన్నారు. తల్లాడ సీపీఎం కార్యాయంలో బుధవారం జరిగిన మంచికంటి 27వ వర్ధంతి సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. మంచికంటి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు తాతా బాస్కర్‌రావు, సీపీఎం మండల కార్యదర్శి రామలింగేశ్వరరావు, సత్యనారాయణరెడ్డి, ఫకీరమ్మ, నన్నేసాహెబ్, నరేష్, కృష్ణయ్య, ప్రకాశరావు పాల్గొన్నారు.

### తృటిలో తప్పిన ప్రమాదం

ముదిగొండ: మండలంలోని గోకినేపల్లి మీదుగా కోదాడ వైపు వెళ్తున్న టిప్పర్ డ్రైవర్ ఒక్కసారిగా బ్రేకులు వేయడంతో ఆగిపోగా... ఖమ్మం నుంచి కోదాడ వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొంది. బుధవారం జరిగిన ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న ముగ్గురికి స్వల్ప గాయాలైనా తృటిలో ప్రమాదం తప్పింది. దీంతో ప్రయాణికులను ఇంకో బస్సులో పంపించారు. పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు.

### విద్యుత్ కోతలు ఎత్తివేయాలి

ముదిగొండ: సమయపాలన లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నారని ముదిగొండ, బాణాపురంలోని విద్యుత్‌సబ్‌స్టేషన్ ఎదుట బుధవారం రైతులు రహదారులపై రాస్తారోకో నిర్వహించారు. విద్యుత్ కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. ముదిగొండలోని విద్యుత్ శాఖ ఏఈ మేకపోతుల శ్రీనివాస్ రైతులతో మాట్లాడారు. రైతుల సమస్యలను ఫోన్‌లో ఏడీఈ భీంసింగ్ దృష్టికి తీసుకెళ్లారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఏఈ తెలిపారు.

### ఢిల్లీ ధర్నాలో బీసీ సంఘం నాయకులు

సత్తుపల్లి: బీసీ రిజర్వేషన్ అమలు చేయాలని కోరుతూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద బుధవారం ధర్నా జరిగింది. ఇందులో సత్తుపల్లికి చెందిన బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నారాయణవరపు శ్రీనివాస్ పాల్గొన్నారు. అదే విధంగా లింగపోయిన పుల్లారావు, పేరం నాగబాబుయాదవ్ పాల్గొన్నారు.

### 13 నుంచి సత్తెమ్మతల్లి తిరునాళ్లు

సత్తుపల్లిరూరల్: మండలంలోని రేజర్లలో శ్రీ గుట్ట సత్తెమ్మతల్లి తిరునాళ్లు ఈనెల 13నుంచి 16వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ బాధ్యులు తెలిపారు. అజ్ఞశ్రీ దీపారాధన, మండపారాధన, అగ్నిప్రతిష్ఠాపనతో మొదలయ్యే తిరునాళ్లు 16వ తేదీన పూర్ణాహుతితో ముగుస్తాయని పేర్కొన్నారు. కాగా, ఉత్సవాల నిర్వహణపై కమిటీ బాధ్యులు ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య దృష్టికి తీసుకెళ్లగా, ఆయన చేసిన సూచనలతో సింగరేణి ఆధ్వర్యాన కల్యాణమండపం, మైదానాన్ని సిద్ధం చేసిన నేపథ్యాన స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# దృష్టి సారించి.. లోపం గుర్తించి

- కంటి వెలుగుతో పేదలకు లబ్ధి
- శిబిరాలకు అనూహ్య స్పందన
- అక్కడికక్కడే అద్దాలు, మందులు పంపిణీ



కంటి శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న డాక్టర్ అవినాష్ (ఫైల్)

**సెల్‌ఫోన్లు, కంప్యూటర్లు అధికంగా ఉండటంతో దగ్గరి చూపు సమస్యలతో బాధపడేవారే ఎక్కువగా ఉన్నట్లు కంటి పరీక్షల్లో తేలింది. చిన్న వయస్సు నుంచి పెద్దవయస్సువారి వరకు ఎక్కువ సమయం సెల్‌ఫోన్ చూడటానికే గడిపేస్తుండటంతో నేత్ర సమస్యలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాలు నిరుపేదలకు వరంగా మారాయి.**

సత్తుపల్లిటౌన్: అంధత్వ నివారణే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమానికి ప్రజల్లో మంచి విశేష స్పందన లభిస్తోంది. ఎంతో కాలంగా దగ్గరి చూపుతో ఇబ్బంది పడుతున్నవారు పరీక్షలు చేయించుకొని అక్కడికక్కడే కళ్లజోళ్లు, మందులు అందిస్తుండటంతో చూపు మెరుగు పడుతోంది. జనవరి 19న ప్రారంభమైన కంటి వెలుగు కార్యక్రమం ఇప్పటికీ 15 రోజులు దాటింది. డివిజన్‌లో కంటి వెలుగు బృందాలు, ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు.

**దగ్గరి దృష్టి లోపమే ఎక్కువగా..**

సత్తుపల్లి డివిజన్‌లోని గంగారం, వేంసూరు, లంకాసాగర్, కల్లూరు, చెన్నూరు, తల్లాడ, ఏన్కూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఇప్పటి వరకు 29,581 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో దగ్గరి చూపు సమస్యతో 7,242 మంది బాధపడుతున్నట్లు గుర్తించి కళ్లజోళ్లు, మందులు పంపిణీ చేశారు. దూరపు చూపుతో ఇబ్బంది పడుతున్న 4,505 మందికి కళ్లజోళ్లు అర్డర్ పెట్టారు. ఎక్కువ మంది దగ్గర దృష్టి లోపమే ఉన్నట్లు పరీక్షల్లో తేలింది. కల్లూరు మండలంలో మూడు బృందాలు, ఏన్కూరు మండలంలో రెండు, గంగారం పీహెచ్‌సీ పరిధిలో మూడు, లంకాసాగర్ పీహెచ్‌సీ పరిధిలో రెండు, తల్లాడ పీహెచ్‌సీ పరిధిలో రెండు, వేంసూరు పీహెచ్‌సీ పరిధిలో మూడు బృందాల చొప్పున కంటి శిబిరాలలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. దీంతో అనేక మందిలో ఉన్న నేత్ర సమస్యలు వెలుగు చూస్తున్నాయి. శుక్లాల సమస్య ఉన్న వారి వివరాలు నమోదు చేసుకొని శస్త్ర చికిత్సలకు సమాచారం ఇస్తామని చెబుతున్నారు. ఇతర కంటి సమస్యలతో బాధపడేవారికి చుక్కల మందులు ఇస్తున్నారు.

**ఆధార్‌తో అనుసంధానం..**

ప్రతి ఒక్కరికి ఆధార్‌తో ఆన్‌లైన్‌లో అనుసంధానం చేసి ఏ సమస్యతో బాధపడుతున్నారో.. ఎంత మోతాదులో కంటి ఇబ్బంది ఉందో కూడా యాప్‌లో వైద్య సిబ్బంది నమోదు చేస్తున్నారు. నిరుపేదలు దృష్టి లోపాలను అధికమించేందుకు శిబిరాలకు అధిక సంఖ్యలో వస్తుండటంతో చక్కని స్పందన లభిస్తుంది.

**అందుబాటులో కళ్లజోళ్లు.. మందులు..**

కంటి వెలుగు శిబిరాల్లో 1ప్లస్, 1.5, 2 ప్లస్, 2.5, 3.0 రకాల కళ్లజోళ్లు సరఫరా అయ్యాయి. అదే విధంగా కంటి సమస్యలతో బాదపడేవారి కోసం

| పీహెచ్‌సీ | కంటి పరీక్షలు చేయించుకున్నవారు | కళ్లజోళ్లు పొందిన వారు |
|---|---|---|
| గంగారం | 6484 | 1372 |
| వేంసూరు | 5283 | 1489 |
| లంకాసాగర్ | 4209 | 1232 |
| కల్లూరు | 4032 | 1103 |
| చెన్నూరు | 1885 | 478 |
| తల్లాడ | 3992 | 830 |
| ఏన్కూరు | 3696 | 738 |

ప్యారాసిట్మల్, విటమిన్-ఏ మరియు డి, బికాంప్లెక్స్ మందులు, సిప్రాక్సిఫోలిన్, హైడ్రాక్సి ప్రోలిన్ చుక్కల మందులు అందుబాటులో ఉన్నాయి. వీటిని వైద్యుల సూచనల మేరకు వైద్య సిబ్బంది రోగులకు పంపిణీ చేస్తున్నారు.

**కళ్లను నిర్లక్ష్యం చేయొద్దు..**



కంటి సమస్యలతో ఇబ్బంది పడేవారు నిర్లక్ష్యం చేయకుండా శిబిరాలలో పరీక్షలు చేయించుకోవాలి. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ నేత్ర పరీక్షలు చేయించుకొని ప్రభుత్వం కల్పించిన కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి. దగ్గరి దృష్టిలోపం ఉంటే అప్పటికప్పుడే కళ్లజోళ్లు ఇస్తున్నాం.

– డాక్టర్ టి.సీతారాం, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ, సత్తుపల్లి

**చాలా కాలం ఇబ్బంది పడ్డా..**



నాకు కళ్లు సరిగా కనిపించడం లేదు. దీంతో నేను చాలాకాలంగా ఇబ్బంది పడ్డాను. మా దగ్గర కంటి వెలుగు నిర్వహిస్తున్నారని తెలుసుకొని ఇక్కడి వచ్చా. వైద్యులు పరీక్షలు చేసి కళ్లజోడు ఇచ్చారు. ఇప్పుడు బాగా కనిపిస్తుంది. కంట్లో బుసులుతోడుతుంటే చుక్కల మందు, మందులు కూడా ఇచ్చారు.

– బి.కృష్ణవేణి, సత్తుపల్లి

## అంధత్వ నివారణకే 'కంటి వెలుగు'



కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు

తల్లాడ: అంధత్వ నివారణ కోసమే రాష్ట్ర ప్రభుత్వం రెండో విడుత కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభించిందని తల్లాడ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండలంలోని మంగాపురం, రామచంద్రాపురం గ్రామాల్లో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి రత్న మనోహర్, మంగాపురం, ఎంపీడీఓ రవీందర్‌రెడ్డి, రామచంద్రాపురం సర్పంచ్‌లు వరపర్ల ఉమ, నునావత్ కవిత, వైద్య సిబ్బంది భాస్కర్, పెద్ద పుల్లయ్య, రాజేశ్వరీ, సతీష్, నాగ నర్సింహారావు, ఉదయ్‌బాస్కర్, పంచాయతీ కార్యదర్శులు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

## క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న కమాండెంట్ సయ్యద్ జామీల్ బాషా

సత్తుపల్లిరూరల్: క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక ఆరోగ్యానికి దోహదపడుతాయని గంగారం 15వ బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జామీల్ బాషా అన్నారు. కొత్తూరు మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం కళాశాల వార్షికోత్సవంలో భాగంగా విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను కమాండెంట్ సయ్యద్ జామీల్ బాషా ప్రారంభించి మాట్లాడారు. క్రీడా పోటీల్లో పాల్గొనటం వల్లే చదువు నుంచి ఒత్తిడిని జయించవచ్చన్నారు. అనంతరం ఆయనను కళాశాల యాజమాన్యం సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ హరికృష్ణ, కరస్పాండెంట్ సాంబశివరావు, చైర్మన్ సత్యనారాయణ, ప్రభాకర్‌రావు, సత్యనారాయణ, అసిస్టెంట్ కమాండెంట్ ఆర్.నాగేశ్వరరావు, ఇంజనీరింగ్ డీన్ హుస్సేన్, క్రీడల కో–ఆర్డినేటర్ మారేశ్వరరావు, విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఆలయ కమిటీ రాజీనామా


బోనకల్: మండలంలోని శ్రీ దుర్గామలేశ్వర స్వామి దేవాలయ కమిటీ బుధవారం తమ పదవులకు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. గ్రామానికి చెందిన చావా భద్రయ్య అనుసరిస్తున్న నియంతృత్వ పోకడలకు నిరసనగా రాజీనామా చేస్తున్నట్లు చైర్మన్ చావా జానికీ ప్రసాద్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. గ్రామస్తులందరూ ఆలయాన్ని నిర్మించారు. ఆలయ నిర్మాణ, నిర్వహణకు సంబందించిన లెక్కలు గ్రామస్తులు అడగ్గా చెప్పడం లేదన్నారు. ఈ క్రమంలో గతేడాది ఆలయ నిర్వహణకు దేవాలయ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆ కమిటీ ద్వారానే అన్ని కార్యకలాపాలు సాగాలన్నారు. కానీ భద్రయ్య సభ్యులకు తెలియకుండా తన సొంత నిర్ణయాలు తీసుకుంటూ కార్యకలపాలు సాగిస్తున్నాడని.. అందుకే తాము రాజీనామా చేస్తున్నట్లు చైర్మన్ తెలిపారు.

### కుష్ఠువ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో కుష్ఠువ్యాధి నివారణ పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో కుష్ఠువ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు.

సమాజంలో కుష్ఠువ్యాధి నిర్మూలనకు తమ వంతుగా కృషి చేస్తామని వైద్య సిబ్బంది, రోగులు, ఆశా కార్యకర్తలు ప్రతిజ్ఞ చేశారు. ఈ వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్ శశిపూర్ణ, డాక్టర్ వెంకట్‌లాల్, డీపీఎంఓ భద్రునాయక్‌లు వివరించారు. వ్యాధి తగ్గడానికి అవసరమైన మందులు పీహెచ్‌సీలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

## గర్భిణులకు సామూహిక సీమంతాలు



సత్తుపల్లిటౌన్: గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న దృశ్యం

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని 18వార్డు, అయ్యగారిపేట–3 అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు పానెం రాణి, కమల ఆధ్వర్యంలో సూపర్‌వైజర్లు రజని, మహాలక్ష్మిల పర్యవేక్షణలో బుధవారం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ కొండమ్మ మాట్లాడుతూ.. సామూహిక వేడుకలలో భాగంగా గర్భిణులు, బాలింతలు, 6 సంవత్సరాలలోపు పిల్లలకు అంగన్‌వాడీ ద్వారా ప్రభుత్వం అందించే అన్ని పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు వరలక్ష్మి, సుజాత, పర్వీన్, ఏసుకుమారి, ఆయాలు నాగేంద్ర, దమయంతి పాల్గొన్నారు.

**అంగన్‌వాడీలో అన్నప్రాసన వేడుకలు..**

తల్లాడ: స్థానిక ఎన్టీఆర్ నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం అన్న ప్రాసన వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమాన్ని తల్లాడ మేజర్ పంచాయతీ సర్పంచ్ పాట్టేటి సంధ్యారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ కృష్ణకుమారి మాట్లాడుతూ.. కార్యక్రమంలో తల్లాడ సూపర్‌వైజర్ రోజా, ఎంపీటీసీ చల్లా తిరుమలాదేవి, అంగన్‌వాడీ టీచర్ శైలజ పాల్గొన్నారు.

### నియామకం..



శ్రీనివాసరావుకు నియామకపత్రం అందజేస్తున్న ఎంపీ కృష్ణయ్య

సత్తుపల్లి: జాతీయ బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా సత్తుపల్లికి చెందిన నిమ్మగడ్డ శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య బుధవారం నియామకపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు వెంకటేశ్, పిండిప్రోలు రామ్మూర్తితో పాటు గుజ్జుల కృష్ణ, ఎర్రా సత్యనారాయణ, డాక్టర్ ప్రసాదరావు, ఎల్లూరి రవి, వంట సత్యనారాయణ పాల్గొన్నారు.

### విశ్వబ్రాహ్మణ సంఘం మండల కమిటీ ఎన్నిక



నూతన కార్యవర్గానికి నియామకపు పత్రాలు అందజేస్తున్న దృశ్యం

బోనకల్: మండల కేంద్రంలో విశ్వబ్రాహ్మణ సంఘం మండల నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా వజ్రాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా బూర్గుల అప్పాచారి, కోశాధికారిగా రావుట్ల వెంకటాచారి, ఉపాధ్యక్షుడిగా రామాచారి, కృష్ణమాచారి, సహాయ కార్యదర్శిగా పిన్నం నరేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సతీష్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అద్దంకి నాగేశ్వరరావు, సోమేశ్వరచారి నియామకపు పత్రాలను అందజేశారు.

### ముందస్తు అరెస్ట్

ముదిగొండ: యాదవ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో చేపట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి తరలివెళ్లకుండా యాదవహక్కుల పోరాట సమితి నాయకులను బుధవారం ముదిగొండ పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. పోలీసులు అరెస్ట్ చేసినవారిలో యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కోటేష్ యాదవ్, నాయకులు పుచ్చకాయల హరిబాబు యాదవ్, అవినాష్ యాదవ్, గిరి యాదవ్‌లు ఉన్నారు.



పోలీసుల అదుపులో ఉన్న యాదవుల సంఘం నాయకులు

## న్యాయమైన పరిహారం ఇవ్వాలి



నిరసన వ్యక్తం చేస్తున్న సీతారామపురం రైతులు

పెనుబల్లి: గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసితులకు నష్టపరిహారం సక్రమంగా అంచనా వేయాలని బాధిత రైతులు సీతారాంపురం వద్ద నున్న హైవే పనుల క్యాంపు కార్యాలయం ఎదుట నిరసన చేశారు. పెనుబల్లి మండలంలోని సీతారామపురం వద్ద సర్వే నంబర్‌లు 59,81లలో ఉన్న 4.77 ఎకరాల భూమిని కోల్పోతున్నారన్నారు. ఈ భూమిలో 100కు పైగా వివిధ రకాల చెట్లతో పాటు నాలుగు గదుల ఇల్లు, వ్యవసాయ మోటారు వంటివి రైతులు నష్టపోతున్నప్పటికీ కేవలం 50 చెట్లకు మాత్రమే నష్టపరిహారం ఇచ్చి రోడ్డు పనులు చేస్తున్నారని తెలిపారు. తాము కోల్పోయిన వాటిని పూర్తిగా పరిహారం ఇచ్చి పనులు ప్రారంభించాలని తహసీల్దార్‌కు వినతి ఇచ్చినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. గట్టిగా అడిగితే పోలీస్‌స్టేషన్ చుట్టూ తిప్పుతున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు కల్పించుకుని మాకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## 'గ్రీన్ ఫీల్డ్ హైవే' భూనిర్వాసితులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న బొంతు రాంబాబు

కొణిజర్ల: గ్రీన్ ఫీల్డ్ హైవే భూనిర్వాసితులకు ప్రభుత్వం మార్కెట్ ధర ప్రకారం పరిహారమివ్వాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. బుధవారం కొణిజర్లలో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఖమ్మం నుంచి దేవరపల్లి వరకు నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవే రహదారి నిర్మాణంలో రైతులు భూములతో పాటు బోర్లు, పైపులు, సుబాబుల్, జామాయిల్, మామిడి చెట్లు నష్టపోయారని తెలిపారు. కావున ప్రభుత్వం రీ సర్వే చేయించి వారికి తగిన నష్టపరిహారాన్ని చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయకార్మిక సంఘం జిలా ఉపాధ్యక్షుడు కృష్ణ, నాయకులు కుటుంబరావు, వెంకటేశ్వర్లు, హరిచంద్, వీరభద్రం పాల్గొన్నారు.

## మన గ్రోమోర్ ఎదుట రైతుల ఆందోళన



ఏఓ రాధకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ముదిగొండ: స్థానిక మనగ్రోమోర్ కేంద్రం వద్ద రైతులు బుధవారం ఆందోళన చేపట్టారు. గ్రోమోర్‌లో పనిచేసే వ్యక్తి రైతుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడని వెంకటాపురం, రాఘవాపురం రైతులు మండల వ్యవసాయ అధికారిణి రాధకు వినతి అందించారు. ఎరువుల మందులు కావాలని అడిగితే పురుగు మందులు కొంటేనే ఈ మందులు ఇస్తానని ఇబ్బందులు పెడుతున్నాడని, స్టాక్ బోర్డ్‌ను షాపు ఎదుట ఉంచడం లేదని, స్టాక్ ఉన్నా ఎరువులు ఇవ్వడం లేదని వినతిలో పేర్కొన్నారు. దీంతో గ్రోమోర్ కేంద్రాన్ని ఏఓ తనిఖీ చేసి స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. రైతులను ఇబ్బందులకు గురిచేసిన వ్యక్తిని తొలగించాలని మన గ్రోమోర్ మేనేజర్‌కు సూచించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం సర్పంచ్ అనంతరాములు, రైతులు రంగారావు, సంపత్‌కుమార్, సురేష్, నాగేశ్వరరావు, పుల్లయ్య, సత్యేంద్ర కుమార్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే సంక్షేమం సాధ్యం



మాట్లాడుతున్న మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్

కల్లూరు రూరల్: కాంగ్రెస్ పార్టీతోనే సంక్షేమం సాధ్యమని మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ అన్నారు. బుధవారం హాథ్ సే హాథ్ జోడో అభియాన్‌లో భాగంగా బుధవారం కల్లూరు మండలంలోని బత్తులపల్లి, యర్రబంజరు, రామకృష్ణాపురం గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాలు ప్రజలను మోసం చేసి పరిపాలన సాగిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ పాలనలో సాధించిన ప్రగతిని వివరిస్తూ.. పార్టీని ఆదరించాలని కోరారు. మండల అధ్యక్షుడు పెద్దబోయిన దుర్గా ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కిరణ్‌కుమార్, గొర్ల అప్పారావు, మనోహర్ నాయుడు, ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మణ్‌రావు, గోపాలస్వామి, కృష్ణారెడ్డి, పుల్లారావు, మాధవరెడ్డి, జనార్దన్, శ్రీనివాసరెడ్డి, రంగ, రామకృష్ణ, ప్రభాకర్, చుక్కా, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### మతిస్థిమితం లేని వ్యక్తికి సపర్యలు




రామకృష్ణ దంపతులు చేరదీసిన మతిస్థిమితం లేని వ్యక్తి

మధిర: మతిస్థిమితం లేని వ్యక్తిని అక్కున చేర్చుకొని అతనికి సపర్యలు చేశారు ఆర్కే ఫౌండేషన్ నిర్వాహకులు దోర్నాల రామకృష్ణ, జ్యోతి దంపతులు. బుధవారం మండలంలోని దెందుకూరు సమీపంలో రోడ్డు పక్కన మతిస్థిమితం లేని వ్యక్తి దుస్తులు లేకుండా ఉన్నాడు. అటుగా వెళ్తున్న మధిర ఎంపీడీఓ కుడుముల విజయభాస్కర్ రెడ్డి అతనిని చూసి ఆర్కే ఫౌండేషన్ నిర్వాహకులు సమాచారం అందించారు. దీంతో ఆ వ్యక్తిని వారు చేరదీసి దుస్తులు ధరింపజేసి మధిరలోని అనాథాశ్రమానికి తీసుకొచ్చారు. శరీరంపై స్వల్ప గాయాలు ఉండడంతో వైద్య సిబ్బంది ద్వారా చికిత్స అందించారు. అతని ఆచూకీ తెలిస్తే ఆర్కే ఫౌండేషన్‌ను సంప్రదించాలన్నారు.

### అపస్మారక స్థితిలో పడిపోయిన వ్యక్తి

చింతకాని: మండలంలోని నాగులవంచ గ్రామ సమీపంలోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఆంధ్రప్రదేశ్‌లోని వత్సవాయి మండలం పోలంపల్లి గ్రామానికి చెందిన కర్నాటి రాంబాబు బుధవారం అపస్మారక స్థితిలో పడిపోయాడు. రోజువారి కూలీలు, రైల్వే ఉద్యోగి గమనించి 108 సిబ్బందికి సమాచారాన్ని అందించడంతో వారు అతన్ని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

### వితరణల వెల్లువ

**మృతుడి కుటుంబానికి బియ్యం వితరణ..**

కారేపల్లి: మండలంలోని భాగ్యనగర్‌తండా గ్రామంలో ఇటీవల మృతిచెందిన గుగులోత్ సామ్యా కుటుంబానికి టీపీసీసీ సభ్యుడు మాళోత్ రాందాస్ నాయక్ 50కేజీల బియ్యంను వితరణ చేశారు. ఈ బియ్యాన్ని ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు మేదరి వీర ప్రతాప్ (టోనీ) ఆధ్వర్యంలో నాయకులు బుధవారం సామ్యా సంస్మరణ కార్యక్రమానికి హాజరై కుటుంబీకులకు అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరప్రతాప్, భీముడు, జానీ, రాంచందర్, రాందాస్, గాంధీ, షబ్బీర్, పాషా పాల్గొన్నారు.

**రూ.10 వేలు నగదు..**



నగదు అందిస్తున్న పొంగులేటి అభిమానులు

ఎర్రుపాలెం: మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన షేక్ వెంకటేశ్వరరావు(60) అనారోగ్యంతో మృతి చెందాడు. ఈయన దహన సంస్కారాల కోసం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభిమానులు సేకరించిన రూ.10వేల నగదును కుటుంబసభ్యులకు అందించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ కవిత, స్థానిక సర్పంచ్ లక్ష్మీ, గోవర్ధన్‌రెడ్డి, రమణారెడ్డి, వెంకట్రామిరెడ్డి, వెంకటరెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రీను, గోపిరెడ్డి, శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

**అనారోగ్య బాధితుడికి..**

మండల కేంద్రానికి చెందిన ఎమ్మార్పీఎస్ నాయకుడు దేవరకొండ వెంకటేశ్వర్లు మాదిగ(50) ఇటీవల అనారోగ్యానికి గురైయ్యాడు. బుధవారం ఈయన కుటుంబానికి రూ.4 వేల నగదు, నిత్యావసరాలను ఎంపీపీ దేవరకొండ శిరీష, ఎమ్మార్పీఎస్ నాయకులు కూరపాటి ప్రభాకర్‌మాదిగ, ఎంపీటీసీ సగ్గుర్తి కిషోర్‌లు అందించారు. కార్యక్రమంలో ముత్యాలరావు, రవి తదితరులున్నారు.

## బడ్జెట్‌లో పేదలు, నిరుద్యోగులకు అన్యాయం



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ నాయకుడు రమేష్

కారేపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పేదలకు, నిరుద్యోగులకు అన్యాయం జరిగిందని డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు చింతల రమేష్ అన్నారు. బుధవారం కారేపల్లి మండలం పాటిమీదిగుంపులో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర బడ్జెట్ల ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా చింతల రమేష్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లతో నిరుద్యోగులకు పరిష్కారం లభించదలేదన్నారు. హక్కులకై యువత పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా నాయకుడు వినోద్, మండల కార్యదర్శి రవికుమార్, నాయకులు సంతోష్, భావ్‌సింగ్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.